ప్రజాశక్తి
గురువారం 25 డిసెంబర్ 2025 5 అనంతపురం

స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును అడ్డుకుంటున్న సిపిఎం నాయకులు

స్మార్ట్‌మీటర్లను అడ్డుకున్న సిపిఎం

◆బలవంతంగా ఏర్పాటు చేస్తే ప్రతిఘటిస్తాం
◆సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నాడు అనంతపురం అర్బన్ నియోజకవర్గం 49 డివిజన్‌లోని సిపిఎం కాలనీలో ప్రజల ఇళ్లకు విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసేందుకు విద్యుత్ సిబ్బంది ప్రయత్నించారు. ఈ విషయం తెలుసుకున్న సిపిఎం నగర కమిటీ నాయకులు అక్కడికి చేరుకుని నివాసాలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయొద్దని అడ్డుకున్నారు. వినియోగదారుల అనుమతి లేకుండా, ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఎలా బిగిస్తారంటూ ప్రశ్నించారు. దేశ వ్యాప్తంగా విద్యుత్ స్మార్ట్ మీటర్‌లను ప్రజలు వ్యతిరేకిస్తున్న అంశం ప్రభుత్వానికి తెలియదా అన్నారు. సిపిఎం నాయకులు, ప్రజలు అడ్డుకోవడంతో విద్యుత్ అధికారులు స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేయకుండా వెనుదిరిగారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి మాట్లాడుతూ ప్రజలపై భారాలు వేసేందుకు ప్రభుత్వాలు దొడ్డిదారిన స్మార్ట్ మీటర్లను బిగించడం సరికాదన్నారు. ఇప్పటికే విద్యుత్ భారాలు మోయలేక పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మొబైల్ సేవల్లాగా విద్యుత్ సేవలు తీసుకురావడం సరికాదన్నారు. ఈ విధానాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వాలు మొండిగా వ్యవహరించడం సరికాదన్నారు. బలవంతంగా వీటిని ఏర్పాటు చేయాలని చూస్తే ప్రజలతో కలిసి అడ్డుకుంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ప్రకాష్, అశ్విని, గీత, రాజు, వెంకటలక్ష్మి, సువర్ణ, సునీత పాల్గొన్నారు.

కార్పొరేషన్‌పై ఏసీబీ కన్ను..?!

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో మూడు సంవత్సరాల క్రితం అవినీతి నిరోధక శాఖ ఏకకాలంలో దాడులు నిర్వహించింది. రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ విభాగాల్లో తనిఖీలు నిర్వహించి, పలు రికార్డులను పరిశీలించారు. మున్సిపల్ కార్పొరేషన్ల పనితీరుపై ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమాచారం తీసుకుంటోంది. అందులో భాగంగా ఇటీవల అవినీతి నిరోధక శాఖ అధికారులు డిఎంఎ డిటిసిపి కేంద్ర కార్యాలయాలకు వెళ్లి ఉద్యోగులకు సంబంధించిన కీలక సమాచారం తీసుకెళ్లినట్టు తెలుస్తోంది. ఎసిబి అధికారులు సమాచారం తీసుకెళ్లారన్న విషయం తెలియడంతో అనంత కార్పొరేషన్‌కు చెందిన కొంతమంది ఉద్యోగులు హుటాహుటిన రాజధానికి పరుగులు తీసినట్లు తెలుస్తోంది. ఏడాదిన్నర కాలంలో టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగంలో అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి. టౌన్‌ప్లానింగ్ విభాగంలో నగరంలో బిల్డింగ్ ప్లాన్లు లేకున్నా జోరుగా అక్రమ నిర్మాణాలు జరిగాయంటూ ఆరోపణలు బలంగా

ఉన్నాయి. ప్రభుత్వ కార్యక్రమం నక్ష ప్రోగ్రాం నత్తనడకన సాగుతుండటంతో పాటు ప్లానర్లు తిరుగుబాటు చేయడంతో అనంత కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ పరువు మంటకలిసింది. ఇదే సమయంలో ఈ శాఖలో పని చేస్తున్న కొందరు ఉద్యోగోన్నతుల పేరిట బదిలీ అయ్యారు. కొందరు బదిలీ ఉత్తర్వులు తీసుకుని కూడా మున్సిపల్ కార్పొరేషన్‌లోనే కొనసాగే ప్రయత్నం చేశారు. చిత్తూరు జిల్లా నుంచి నీరజాక్ష ఉద్యోగోన్నతిపై అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌కు వచ్చి బాధ్యతలు చేపట్టడంతో శిరీష డీమ్డ్‌టు రిలీవ్ కావాల్సి వచ్చింది. ఏడాదిన్నర కాలంలో అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో జరిగిన ఉద్యోగుల అవినీతి చిట్టాపై ఏసీబీ దృష్టి సారించి సమాచారాన్ని కేంద్ర కార్యాలయం నుంచే తీసుకెళ్లినట్లు తెలుస్తోంది.

అనంత కార్పొరేషన్ రెవెన్యూ విభాగంలో ఇటీవల పలు వివాదాలు చెలరేగాయి. రెవెన్యూ ఆఫీసర్ విజయకుమార్ ఏకంగా నెల రోజుల సెలవుపై వెళ్లారు. అంతకుముందే రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ రజాక్ ఏడాది కాలం గడువు ముగియకనే అడ్మినిస్ట్రేషన్ విభాగంలోని ఈ-1గా బదిలీపై వెళ్లారు. నెల రోజుల సెలవుపై వెళ్లిన విజయ్ కుమార్ తిరిగి విధులకు హాజరైనా రెవెన్యూ ఆఫీసర్‌గా మాత్రం బాధ్యతలు చేపట్టటానికి విముఖత వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. సెలవు కాలానికి అకౌంట్స్ ఆఫీసర్‌గా ఉన్న దేవశంకర్‌కు రెవెన్యూ ఇన్‌ఛార్జి ఆఫీసర్‌గా బాధ్యతలు అప్పగించారు. కాగా ఆ పోస్టు వ్యవహారంలో పెద్ద ఎత్తునే డబ్బులు చేతులు మారాయానే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అయితే నెల రోజుల సెలవు కాలం ముగిసిన తర్వాత విజయ్ కుమార్ రెవెన్యూ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపడతారా.. లేకుంటే కొత్త వ్యక్తులకు అవకాసం లభిస్తుందా అన్న చర్చ కార్పొరేషన్‌లో నడుస్తోంది. ఇక రెవెన్యూ విభాగంలో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు ఒక ఆర్‌ఓపై పరస్పరం ఫిర్యాదులు చేసుకోవడం ఇటీవల తీవ్ర చర్చనీయాంశం అయ్యింది.

ఉద్యోగుల అవినీతిపై సమాచార సేకరణ

ఎసీబీ గుబులుతో రాజధానికి ఉద్యోగుల పరుగులు

ఇలాంటి పరిస్థితుల్లో అవినీతి నిరోధక శాఖ అధికారులు గతంలో జరిపిన దాడుల పర్యవసానంగా ప్రస్తుతం వాటికి సంబంధించిన సమగ్ర సమాచారం రాష్ట్ర కార్యాలయం నుంచి సేకరించడం కొందరు ఉద్యోగుల్లో మరింత భయాన్ని కలిగిస్తోంది. ఇటీవల కార్పొరేషన్ అధికారులు తరచూ కోర్టు కేసుల పనుల నిమిత్తం విజయవాడకు వెళుతున్నారు. వాస్తవంగా వీరంతా కోర్టు కేసుల పని పేరుతో వారి సమస్యలను పరిష్కరించుకునేందుకు విజయవాడ వెళ్తున్నారనే చర్చ నడుస్తోంది. ఏసీబీ సేకరించిన సమాచారం గురించి ఆరా తీయడంతో పాటు తమకు ఎసరు రాకుండా చూసుకునేలా విజయవాడలో మంత్రాంగం నడుపుతున్నట్లు సమాచారం. ఏసీబీ సేకరించిన అక్రమాల చిట్టా బహిర్గతం అయ్యి అవినీతి అధికారులపై చర్యలు ఉంటాయా.. లేక మరికొంత కాలం సాగదీత ధోరణి ఉంటాందా అన్నది వేచి చూడాల్సి ఉంది.

మడకశిర రాజేశ్వరికి పరిశోధక డిగ్రీ

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం పట్టణానికి చెందిన మడకశిర రాజేశ్వరి ప్రాచీన తెలుగు సాహిత్యంలో చేసిన పరిశోధనకు పరిశోధక డిగ్రీను అందుకున్నారు. కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయం డిగ్రీను బుధవారం ఆమెకు అందజేశారు. బలిజేపల్లి లక్ష్మీకాంత కవి విరచిత "సత్యహరిశ్చంద్రియం-సమగ్ర నాటక నిర్మాణ శిల్పం" అనే అంశంపై ఆచార్య ఎకె.వేణుగోపాల్ రెడ్డి పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఈ పరిశోధనలో ప్రాచీన నాటక సాహిత్యంలోని నిర్మాణ శిల్పాన్ని విశ్లేషణతో పాటు, సత్యం, ధర్మం, న్యాయం వంటి మహోన్నత విలువల ప్రాసంగికతను వివరించారు. మానవ స్వభావంలోని అంతర్లీన లక్షణాలను లోతుగా అధ్యయనం చేసి, వాటిని నేటి సామాజిక పరిస్థితులతో పోల్చి సన్మార్గంలో పయనించే విధానంపై పరిశోధన చేశారు. ఈ పరిశోధనకు ద్రావిడ విశ్వవిద్యాలయం మడకశిర రాజేశ్వరికి డాక్టరేట్ పట్టాను ప్రదానం చేసింది.

ఎంపీడీవో కారును కడుగుతున్న అటెండర్ లీలావతి

'కారు కడిగించిన ఎంపిడిఒ'

అటెండర్‌తో కారు శుభ్రం చేయించిన అధికారి

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

రాయదుర్గం ఎంపిడిఒ కొండన్న పనితీరు వివాదాస్పదంగా మారుతోంది. మండల పరిషత్ అధికారి హోదాలో ఆయన కింది స్థాయి అధికారులను సొంత పనులకు ఉపయోగిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. బుధవారం నాడు అటెండర్ ఎంపిడిఒ కారును శుభ్రం చేయడం ఈ విమర్శలకు మరింత బలం చేకూరుస్తోంది. అటెండర్ లీలావతి ఎంపిడిఒ కారు (ఎపి39 డిడి3520)ను మండలాభివృద్ధి కార్యాలయంలో శుభ్రం చేస్తున్న దృశ్య తీవ్ర చర్చనీయాంశం అయ్యింది. ప్రభుత్వ అధికారి తాను ఉపయోగించే కారును అటెండర్‌తో కడిగించడం ఏమిటంటూ అక్కడున్న వారు అసహనం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారి అయ్యి ఉండి కూడా ఉద్యోగులను సొంత పనులకు ఉపయోగించుకోవడం ఏమిటంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ ఘటనలపై ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయంపై వివరణ కోరేందుకు ప్రజాశక్తి ప్రయత్నించగా ఎంపీడీవో ఫోన్ కలవలేదు.

భార్య పదవి... భర్త పెత్తనం..!

మార్కెట్ యార్డ్ సెక్రటరీపై చైర్మన్ భర్త చిందులు

ప్రజాశక్తి-గుంతకల్లు

చైర్మన్ కుర్చీలో కూర్చొని మార్కెట్‌యార్డు సెక్రటరీపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మాతృనాయక్

గుంతకల్లు మార్కెట్ యార్డ్ ఛైర్మన్ లక్ష్మీదేవి భర్త మాతృనాయక్ గురువారం నాడు మార్కెట్ యార్డులో ఛైర్మన్ కుర్చీలో కూర్చున్నారు. కూర్చోవడమే కాకుండా ఏకంగా యార్డ్ సెక్రటరీ బాలాజీ రావుపై ఓ విషయంలో ఆగ్రహం వ్యక్తం చేస్తూ చిందులేశాడు. పట్టణంలోని వ్యాపారస్తులు మార్కెట్ యార్డులో క్రయవిక్రయాలు మెరుగవ్వాలంటూ ఇటీవల ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సెక్రటరీని ఆదేశించారు. ఇదే సమయంలో సెక్రటరీ యార్డులో వ్యాపారాలు నిర్వహించిన సంబంధిత వ్యాపారులకు నోటీసులు జారీ చేశారు. అది తెలుసుకున్న ఛైర్‌పర్సన్ లక్ష్మీదేవి భర్త మాతృనాయక్ యార్డుకు వెళ్లారు. ఛైర్మన్ కుర్చీలో కూర్చొని తానున్న చోటికి మార్కెట్ యార్డ్ సెక్రటరీ బాలాజీరావును పిలిపించుకున్నారు. తనకు తెలియకుండా వ్యాపారులకు నోటీసులు ఎందుకు ఇచ్చావంటూ కార్యదర్శిపై ఏక వచనంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఎమ్మెల్యే ఆదేశాల మేరకే నోటీసులు ఇచ్చానంటూ సెక్రటరీ బాలాజీ రావు చెప్పే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో ఛైర్మన్ భర్త మరోసారి కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఇద్దరి మధ్య వాదన జరిగింది. అక్కడే ఉన్న సిబ్బంది కలుగజేసుకుని ఇద్దరికి సర్దిచెప్పి సమస్యను సద్దుమణిగించారు. ఈ ఘటనపై ప్రజాశక్తి సెక్రటరీని వివరణ కోరగా ఛైర్‌పర్సన్ లక్ష్మీదేవి బాధ్యతలు స్వీకరణ స్వీకరించినప్పటి నుంచి ఆమె భర్త మాతృనాయక్ మార్కెట్‌యార్డు సిబ్బందిపైన పెత్తనం చెలాయిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

పంచాయతీ కార్మికుల కన్నెర్ర

కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న సిఐటియు నాయకులు, గ్రామ పంచాయతీ కార్మికులు

◆పెండింగ్ వేతనాల కోసం కలెక్టరేట్ వద్ద ఆందోళన
◆మూకట్లో గడ్డి పెట్టుకుని ప్రదర్శన
◆కార్మికుల ఆందోళనతో దిగొచ్చిన అధికారులు
◆వేతనాలు అందిస్తామని డిపిఒ హామీ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పెండింగ్ వేతనాలు, ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు ఆందోళన చేపట్టారు. వేతనాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసిన కార్యదర్శులు, సర్పంచుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కన్నెర్ర చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికులు అనంతపురం కలెక్టరేట్ వద్ద చేపట్టిన రిలేదీక్షలు బుధవారం 3వ రోజు కొనసాగాయి. నిరసనలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీ కార్మికులు అనంతపురం నగరంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. కార్మికులు మూకట్లో గడ్డి పెట్టుకుని సంఘమేష్ సర్కిల్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. కలెక్టరేట్ ప్రధాన గేటు ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు. గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్షులు హెచ్.మధు అధ్యక్షత నిర్వహించిన ధర్నాలో సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్‌వి.నాయుడు, ఎస్.నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని గ్రామపంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులకు నెలల తరబడి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వేతనాలు ఇవ్వాలని చాలా రోజుల నుంచి కార్యదర్శులు, సర్పంచులకు మొరపెట్టుకున్నా వారు స్పందించ లేదన్నారు. పంచాయతీలకు వస్తున్న నిధులన్నింటినీ పక్కదారి పట్టించి, కార్మికులకు వేతనాలు ఇవ్వమంటే ఖజానా ఖాళీగా ఉందని సమాధానం ఇస్తున్నారన్నారు. పంచాయతీలో ఉన్న నిధుల్లో 50 శాతం మేరకు మొదటి ప్రాధాన్యతగా కార్మికులకు వేతనాలు చెల్లించాలని జీవోలు చెబుతున్నా అధికారులు వాటిని పాటించడం లేదన్నారు. కార్యదర్శులు, సర్పంచులు ఏకమై కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో రెండు, మూడు నెలల్లో సర్పంచులు పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు అన్నింటినీ చెల్లించే ఏర్పాటు చేయాలని కోరారు. నెలల తరబడి కార్మికులకు జీతాలు రాకుంటే వారు కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. ఇంటి అద్దెలు, కుటుంబ పోషణ, పిల్లల ఫీజులు తదితర వాటికి వడ్డీలకు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కలెక్టర్ గారు జోక్యం చేసుకుని కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించే ఏర్పాటు చేయాలని కోరారు. పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి జిల్లా వ్యాప్తంగా పనులను ఆపేసి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. కార్మికుల ఆందోళన విషయం తెలుసుకున్న జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు వారి వద్దకు విచ్చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు, కార్మికులు సమస్యలను డిపిఒ దృష్టికి తీసుకెళ్లారు. వేతనాలు ఇవ్వకుండా జాప్యం చేసిన పంచాయతీల కార్యదర్శులు అందరికీ నోటీసులు పంపుతామన్నారు. సాధ్యమైనంత త్వరలో పెండింగ్ వేతనాలు అన్నీ అందించే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పోస్ట్ శాంక్షన్లు తీసుకోవడానికి ఎక్కడైనా లంచం అడిగినా, అడ్డుపడిన తనకు సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటానని తెలిపారు. అధికారి హామీతో నాయకులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లాఉపాధ్యక్షులు మన్నీల రామాంజనేయులు, నగర అధ్యక్షులు వెంకటనారాయణ, గ్రామ పంచాయతీల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు గోపాల్, ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, సిఐటియు నగర కోశాధికారి ఎన్టీఆర్ శ్రీనివాసులు, ఆటో యూనియన్ నగర అధ్యక్షుడు ఆజామ్ బాషా, గ్రామ పంచాయతీ జిల్లా కోశాధికారి నూర్‌బాషా, వీరాంజనేయులు, మూర్తి, బాలాజీ నాయక్, రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణనియామకాల్లో ముగ్గురికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో అక్టోబర్, నవంబర్ నెలలలో నిర్వహించిన "జిందాల్ సా ప్రయివేటు లిమిటెడ్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో ముగ్గురు జెఎన్‌టియు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జె.శ్రీనివాసులు బుధవారం తెలిపారు. మెకానికల్ విభాగం నుంచి కె.హస్విత, వై.సందీప్ కుమార్, ఎలక్ట్రికల్ విభాగం నుంచి బి.చక్రధర్‌లు ఉద్యోగాలకు ఎంపిక అయ్యారు. వీరికి వార్షిక వేతనంగా రూ.5.5 లక్షలు అందనుంది. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను వైస్‌ఛాన్సలర్ ఆచార్య హెచ్.సుదర్శన రావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, ఒస్డ్ టు వీసీ ఎన్.దేవన్న, డైరెక్టర్ అఫ్ ఇండస్ట్రియల్, ప్లేస్‌మెంట్ ఆర్.కిరణ్మయి, ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వసుంధర అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న వైస్ ఛాన్సలర్

కాలువగండి పనులు పూర్తి చేయండి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప - పిఎబిఆర్ గండి మరమ్మతుల పరిశీలన

పిఎబిఆర్ కాలువ గండి పనులను పరిశీలిస్తున్న సిపిఎం బృందం

ప్రజాశక్తి-కూడేరు

కూడేరు మండల పరిధిలోని పీఏబీఆర్ డ్యాం నాలుగవ రహదారి నెంబర్ వద్ద కాలువకు గండి పడింది. ప్రస్తుతం గండి పూడ్చివేత పనులను జరుగుతున్నాయి. ఈ పనులను బుధవారం నాడు సిపిఎం జిల్లా కమిటీ బృందం పరిశీలించింది. సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.రామిరెడ్డి, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, ఎం.కృష్ణమూర్తి, జిల్లా కమిటీ సభ్యులు ముత్తుజా, పండ్ల తోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.శివారెడ్డి, రైతుసంఘం జిల్లా నాయకులు టి.సంజీవరెడ్డిలు ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా నల్లప్ప మాట్లాడుతూ పిఎబిఆర్ కుడి కాలువ ద్వారా 49 చెరువులకు గత నెల 25న నీళ్లు విడుదల చేస్తామని అధికారులు ప్రకటన చేశారన్నారు. కాలువలో జంగిల్ క్లియరెన్స్ చేయకుండానే పీఏబీఆర్ డ్యాం నుంచి కుడికాలువకు నీరు విడుదల చేశారన్నారు. కాలువ సామర్థ్యం సరిగా లేకపోవడంతో గండిపడిందన్నారు. గండి పడిన నీరు సమీప పొలాల్లోకి వెళ్లి రైతుల పంటలు నాశనం అయ్యాయన్నారు. కాలువ పనులను పూర్తి స్థాయిలో మర్మతులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కుడి కాలువ కింద ఉన్న 49 చెరువులకు పూర్తిస్థాయిలో నీరు చేరాలంటే కాలువకు ఎక్కడా గండ్లు పడకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గండిపడడం ద్వారా పంటలు నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలన్నారు. చెరువులకు నీరు చేరేంత వరకు కాలువపై అధికారులు పర్యవేక్షణ చేయాలని కోరారు.

కొనుగోలులో మోసాన్ని గుర్తించాలి

ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాల వైస్ ఛైర్మన్ చక్రధర రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

వినియోగదారులు కొనుగోలు చేసే వస్తువులపై మోసం జరుగుతుందని, దీనిని గుర్తించి ప్రశ్నించాల్సిన అవసరం ఉందని ఎస్‌వి.కళాశాల వైస్ ఛైర్మన్ చక్రధరరెడ్డి తెలిపారు. బుధవారం నాడు నగరంలోని ఎస్వీ డిగ్రీ, పిజి కళాశాలలో కామర్స్ అండ్ మేనేజ్మెంట్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చక్రధరరెడ్డి మాట్లాడుతూ కొనే ప్రతి వస్తువులోనూ, సేవలోనూ లోపం లేకుండా సరైన ధర, తూకం, నాణ్యత, స్వచ్ఛతతో కూడినవి పొందే హక్కు వినియోగదారులకు ఉందన్నారు. ఇటీవల వస్తువుల్లో కల్తీ పెరిగిందన్నారు. వినియోగదారుల హక్కులను తెలుసుకుని ఇలాంటి వాటిని ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. కళాశాల ఏవో శ్రీనాథ్ మాట్లాడుతూ వస్తువుల నాణ్యత సరిగా లేకున్నా, ఆయా సంస్థలు అందించే సేవల్లో లోపాలున్నా వినియోగదారు వినియోగదారుల చట్టం ద్వారా న్యాయం పొందవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కామర్స్ అండ్ మేనేజ్మెంట్ విభాగం అధ్యాపకులు ఏ.నాగలక్ష్మి, సి.విశ్వతేజ, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కళాశాల వైస్ ఛైర్మన్ చక్రధరరెడ్డి

టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడిగా బండి ఆదినారాయణ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

బుక్కరాయసముద్రం టిడిపి మాజీ మండల కన్వీనర్ బండి ఆదినారాయణ తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ అధిష్టానం ఆదినారాయణకు నియామక ఉత్తర్వులు అందించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ పెద్దలు తన సేవలు గుర్తించి ఉపాధ్యక్షునిగా ఎంపిక చేయడం ఆనందంగా ఉందన్నారు. తన ఎంపికకు సహకరించిన ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు కృతజ్ఞతలు తెలియజేశారు.

నారా లోకేష్‌తో బండి ఆదినారాయణ

జల్ అప్రాన్ దివస్ కార్యక్రమం

ప్రజాశక్తి-యల్లనూరు

మండల పరిధిలోని తిరుమలాపురం గ్రామంలో జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా సర్పంచి ఎ.రామాంజల రెడ్డి ఆధ్వర్యంలో జల్ అప్రాన్ దివాస్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. డిజిటల్ ఇంజనీర్ మౌనిక పంచాయతీ కార్యదర్శి వెంకటనాయుడు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

'ఉపాధి'ని మార్చొద్దు : సిపిఎం

ఎంపీడీవో కార్యాలయంలో ఏవో శ్రీధర్‌కు వినతి పత్రం ఇస్తున్న సిపిఎం, వ్యకాసం నాయకులు

ప్రజాశక్తి-పుట్లూరు

మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వారు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏవో శ్రీధర్‌కు వినతి పత్రం అందించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సూరి మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం పేరు మార్పు దుర్మార్గమన్నారు. పాత పేరునే యధావిధిగా కొనసాగించాలని కోరారు. ఏడాదికి 200 రోజులు పని దినాలు కల్పించడంతో పాటు రోజుకు రూ. 600 వేతనం ఇవ్వా లని, బకాయి బిల్లులు చెల్లించాలని, రూ. 2 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యకాసం మండల కార్యదర్శి టి.పెద్దయ్య, రైతు సంఘం నాయకులు శివారెడ్డి, భాస్కర్ రెడ్డి, కెవిఎస్ నాగభూషణ్, టి.ఆదినారాయణ, హరీష్, రాము, ఓబులేసు, శివ ప్రసాద్, కుళ్లాయప్ప, జె.పెద్దయ్య, కూలీలు పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థను కాపాడుతా

పామిడి నూతన సిఐ శివశంకర్‌నాయక్

బాధ్యతలు చేపట్టిన సిఐ శివశంకర్‌నాయక్

ప్రజాశక్తి-పామిడి

ప్రజలతో మమేకమై ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థను కాపాడుతానని పామిడి నూతన సిఐ శివశంకర్‌నాయక్ తెలిపారు. పామిడి అర్బన్ పోలీస్ స్టేషన్ నూతన సిఐగా ఎస్.డి.శివశంకర్ నాయక్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన కడప ఎస్‌బి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న సిఐ కర్నూల్ రేంజ్ వెల్దుర్తికి బదిలీ అయ్యారు. నూతన సిఐ శివశంకర్‌నాయక్ మాట్లాడుతూ లా అండ్ ఆర్డర్‌పై ప్రత్యేకంగా నిఘా పెడతామన్నారు. చోరీల నియంత్రణకు చర్యలు చేపడతామన్నారు. పేకాట, మట్కా, జూదం, కోడి పందెం, తదితర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. నాటుసారా తయారీ, అమ్మకాలు జరగకుండా చూస్తామన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్న ప్రజలు నేరుగా సంప్రదించవచ్చు అని తెలిపారు. చట్ట విరుద్ధంగా కార్యకలాపాలు నిర్వహించే వారి సమాచారం పోలీసులకు అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అనంతరం సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అందరూ సహకరించాలని కోరారు.

అహుడా అభివృద్ధిపై వైస్ చైర్మన్ సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న అహుడా వైస్ చైర్మన్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలోని జాయింట్ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం అహుడాపై సంబంధిత అధికారులతో జాయింట్ కలెక్టర్, అహుడా వైస్ చైర్మన్ శివ్‌నారాయణ్‌శర్మ సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఆయన మాట్లాడుతూ త్వరలో పెనుకొండ, మడకశిర ఎంఐజి లేఅవుట్లలో ప్లాట్ల విక్రయానికి వేలం నిర్వహించాలన్నారు. అనుమతులు పొందని, అనాథరైజ్డ్ లేఔట్లపై కఠిన చర్యలు తీసుకోవాల న్నారు. అనుమతులు తీసుకొని మూడేళ్లలో పనులు పూర్తి చేయని యజమానులు, డెవలపర్లకు నోటీసులు ఇవ్వాలన్నారు. అనంతపురంలో స్విమ్మింగ్ పూల్, జిమ్, ఫుడ్ కోర్ట్ ఏర్పాటు ప్రణాళికపై చర్చించారు.

కునుతూరు లేఅవుట్‌లో ప్లాట్ల విక్రయానికి హెల్ప్ డెస్క్ ఏర్పాటు

ధర్మవరం పరిధిలోని కునుతూరు లేఅవుట్‌లో ప్లాట్ల విక్రయానికి వైస్ చైర్మన్ ఆదేశాలతో నగరంలోని అహుడా కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. ఈ డెస్క్‌ను ప్లాట్ల కొనుగోలుదారులు సద్వినియోగం చేసుకోవాలని జెసి సూచించారు. కార్యక్రమంలో అహుడా సెక్రటరీ రామకృష్ణారెడ్డి, డీఈ రేవంత్, ఈఓ అరుణకుమారి, ఏఓ రవిచంద్రన్, తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ శుభాకాంక్షలు : అనంత

ప్రజాశక్తి-అనంతపురం

కరుణ, త్యాగానికి ప్రతీక క్రిస్మస్ అని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. విశ్వమానవాళికి తన ప్రేమతత్వంతో వెలుగులు పంచిన కరుణా మయుడు ఏసుక్రీస్తు అన్నారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా బుధవారం ఆయన క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. క్రీస్తు జననం శాంతికి సంకేతమని.. తన జీవితం, మరణం ద్వారా ఈ లోకానికి సరైన మార్గాన్ని చూపారని తెలిపారు. సమాజంలో చెడును పక్కన పెట్టి మంచిని పెంపొందించాలని, ఏసు క్రీస్తు బోధనలు మనల్ని సన్మార్గంలో నడిచేలా చేస్తాయన్నారు. ప్రపంచ మానవాళికి శాంతియుతమైన, ప్రేమ పూర్వకమైన జీవన మార్గాన్ని ఉపదేశించి సమాజాన్ని సంస్కరించిన యుగకర్త జీసస్ అన్నారు. ప్రతి ఒక్కరూ స్వార్థాన్ని వీడితేనే సమ సమాజ స్థాపన సాధ్యమవుతుందని తెలిపారు. జీసస్ జన్మదినం సర్వ మానవాళికి పవిత్రదినం అని పేర్కొంటూ జిల్లా ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

ఆడపిల్లల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలి

సమీక్ష సమావేశంలో ఆర్డీవో కేశవనాయుడు

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో కేశవనాయుడు

ప్రజాశక్తి-అనంతపురం

ఆడపిల్లల ప్రాముఖ్యతపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆర్డీవో కేశవనాయుడు ఆదేశించారు. నగరంలోని ఆర్డీవో కార్యాలయంలో బుధవారం ఆర్డీవో అధ్యక్షతన గర్భస్థపిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టంపై డివిజినల్ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ ఆడ పిల్లల ప్రాముఖ్యతపై ప్రతి మండలంలో ఉన్న గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. అలాగే ఎక్కువ టీనేజ్ ప్రెగ్నెన్సీలు ఉన్న, ఎక్కువ బాల్యవివాహాలు జరిగిన గ్రామా లను ఎంచుకొని ఆ గ్రామాల్లోని సచివాలయ, వైద్య సిబ్బంది సంయుక్తంగా అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేయాలని ఆదేశించారు. అలాగే గ్రామస్థాయిలో యుక్త వయసు బాలికల తల్లిదండ్రులకు కనీసం నెల రోజులకు ఓ సారి బాల్యవివాహాలు, టీనేజ్ ప్రెగ్నెన్సీ వల్ల కలిగే అనర్థాలు, దుష్పరిణామా లను తెలియజేయాలన్నారు. ఈ విషయాలపై సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, మహిళా పోలీస్ ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమాన్ని సంబంధిత శాఖలు సమిష్టిగా పైలెట్ ప్రాజెక్టు మోడ్‌లో తీసుకోవాలని ఆదేశించారు. లింగ నిర్ధారణ జరగకుండా ఆకస్మిక తనిఖీలు చేయాలని, గట్టి నిఘా పెట్టాలని ఆదేశించారు. సమావేశంలో ప్రభుత్వాసుపత్రి చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ రవికుమార్, స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ నిసార్ బేగం, పెథాలజిస్ట్ డాక్టర్ దివ్య, ఆర్‌డిటి సంస్థ డాక్టర్ దుర్గేష్, ఎస్ఐ విజయభాస్కర్, ఎన్జీవో రెడ్స్ ప్రతినిధి సుశీల, ఐసిడిఎస్ అధికారిణి సంధ్యారాణి, హెచ్ఈఓ త్యాగరాజు, డిప్యూటీ హెచ్ఈఓ గంగాధర్, వేణుగోపాల్, వెంకటేష్, కిరణ్, శ్రీకాంత్, లీగల్ అడ్వైజర్, ఆశారాణి, పాల్గొన్నారు.

'దుర్గం' మున్సిపల్ బడ్జెట్ ఆమోదం

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శిల్ప

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పురపాలక సంఘం వార్షిక బడ్జెట్‌ను పాలకమండలి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం చైర్‌పర్సన్ పొరాలు శిల్ప అధ్యక్షతన పాలకమండలి సాధారణ సమావేశం, ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. 2025-26 ఆర్థిక సంవత్స రానికి సవరించిన బడ్జెట్ అంచనాను, 2026-27 అంచనా బడ్జెట్‌పై సమావేశంలో చర్చించారు. 2025-26 ప్రారంభ విలువ రూ. 19.45 కోట్లు కాగా మిగులు రూ. 11.64 కోట్లుగా చూపారు. 2026-27 మొత్తం ఆదాయం రూ. 45.49 కోట్లుగా, వ్యయం రూ. 44.39 కోట్లుగా, మిగులు రూ. 1.10 కోట్లుగా కౌన్సిల్ అంచనా బడ్జెట్‌ను ఆమోదించింది. కౌన్సిలర్ బండి అజయ్ కుమార్ మాట్లాడుతూ పురపాలిక ద్వితీయ శ్రేణి నుంచి ప్రథమ శ్రేణికి మారినందున నీటి, ఇతర పన్నులు పెంచుతారా అని ప్రశ్నించారు. కమిషనర్ దివాకర్‌రెడ్డి సమాధానం ఇస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పురపాలక సంఘం స్థాయిని ప్రథమ శ్రేణికి మార్చిందని, పురపాలక సంఘానికి నిధుల కేటాయింపు, మౌలిక సౌకర్యాల కల్పన, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, తదితర సదుపాయాలు మెరుగుపరిచాక పాలకమండలి నిర్ణయం మేరకు పన్ను పెంపు విషయాన్ని పరిశీలిస్తామన్నారు. 28వ వార్డు కౌన్సిలర్ గోవిందరాజులు మాట్లాడుతూ వట్లకుంట ప్రాంతంలో తాగునీరు కలుషితం అవుతుందని చాలా కాలంగా చెబుతున్నా నేటికీ పైప్ లైన్ మార్చకపోవడం విచారకరం అన్నారు. కౌన్సిలర్ పద్మజ మాట్లా డుతూ గతంలో ఇందిరమ్మ ఇళ్ల కాలనీల్లో స్థలాల కేటాయింపు సందర్భంగా దళారులు ఒకరికి కేటా యించిన స్థలాన్ని మరొకరికి అమ్మి కొత్త వ్యక్తులు నిర్మాణం చేపట్టారన్నారు. ఈ విషయమై పలుసార్లు రెవెన్యూ, మున్సిపల్, గృహ నిర్మాణ సంస్థ అధికారులకు ఫిర్యాదు చేసినా ఇటు కొత్తగా నిర్మించిన వారికి కానీ లేదా గతంలో పట్టా యజమానిగా ఉన్నవారికి కానీ న్యాయం చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. అయితే లబ్ధిదారులు, బాధితులు తరచూ స్థలాలు, పక్కా ఇళ్ల విషయమై ఘర్షణ పడుతున్నారని, ఆ సమస్యకు తగిన పరిష్కారం చూపాలన్నారు. పురపాలక మండలి సాధారణ సమావేశపు అజెండా, ప్రత్యేక సమావేశపు వార్షిక బడ్జెట్‌లు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. సమావేశంలో మున్సిపల్ ఇంజినీర్ సురేష్, టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ మురళీమోహన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక వ్యవస్థకు కేంద్ర బిందువు వినియోగదారుడు

హక్కుల పరిరక్షణ సంస్థ అధ్యక్షుడు మోహన్

సమావేశంలో పాల్గొన్న వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంస్థ అధ్యక్షుడు మోహన్, సభ్యులు

ప్రజాశక్తి-అనంతపురం

ఆర్థిక వ్యవస్థకు కేంద్ర బిందువు వినియోగదారుడు అని వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంస్థ అధ్యక్షుడు మోహన్ తెలిపారు. అలాంటి వినియోగదారుల సంరక్షణ బాధ్యత ప్రభుత్వాలదే అన్నారు. నగరంలోని కెఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో బుధవారం జాతీయ వినియోగదారుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ షఫీ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచంలో ఎక్కడ చూసినా కల్తీలు, నకిలీలు రాజ్యమేలుతున్నాయన్నారు. సులభ సంపాదన కోసం ఎంతటి దిగజారుడుకైనా ఒడిగట్టుతున్నారన్నారు. సమాజంలో స్వార్థం, మోసం వంటి కారణాలే కల్తీలు, నకిలీలకు కారణమన్నారు. వీటి వల్ల ఎన్ని చట్టాలు చేసినా ప్రయోజనం శూన్యమే అన్నారు. మోహన్ మాట్లాడుతూ ఆర్థిక వ్యవస్థకు కేంద్ర బిందువైన వినియోగదారులు కల్తీలు, నకిలీలు, అనుకరణల వల్ల చాలా నష్టపోతున్నారన్నారు. ప్రజలు కొనుగోలు చేసే వస్తువులపై చెల్లించే పన్నుల ద్వారానే పాలకులు, ప్రభుత్వ అధికారులు వేతనాలు పొందుతున్నారన్నారు. పన్నుల ద్వారా వచ్చే డబ్బుల ద్వారానే ప్రభుత్వాలు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నాయన్నారు. ఆర్థికవ్యవస్థకు కారణమైన వినియోగదారుల సంరక్షణ బాధ్యత ప్రభుత్వాలదే అన్నారు. అందుకే మహాత్మగాంధీ సైతం వినియోగదారుడే రాజు అన్నారని గుర్తు చేశారు. వినియోగదారుల కోసం ప్రస్తుత సమాజంలో మరిన్ని కఠిన చట్టాల ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. వినియోగదారుల సంస్థ జనరల్ సెక్రటరీ అసదుల్లా మాట్లాడుతూ వస్తు సేవల విషయంలో నష్టం జరిగితే కన్స్యూమర్ కమిషన్‌లో న్యాయం పొందే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లెక్చరర్లు ఆదినారాయణ, మురళీకృష్ణ, విజయలక్ష్మి, అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్యశాఖ అధికారికి ఉద్యోగోన్నతి

కెంచె లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-రాయదుర్గం

వైద్య ఆరోగ్యశాఖలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా పని చేస్తున్న కెంచె లక్ష్మీనారాయణకు ఉద్యోగోన్నతి లభించింది. ఆయన డి.హీరేహాల్‌లో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించేవారు. ప్రస్తుతం ఆయన జిల్లా డిప్యూటీ డెమో(జిల్లా డిప్యూటీ ఎక్స్‌టెన్షన్ అండ్ మాస్ మీడియా) ఆఫీసర్‌గా ఉద్యోగోన్నతి పొందారు. ఆయన గురువారం బాధ్యతలు చేపట్టనున్నారు. ఆయనకు ఉద్యోగోన్నతి లభించడం పట్ల పలువురు మిత్రులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్యే క్రిస్మస్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-శింగనమల

నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న క్రిస్టియన్స్, ప్రజలకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ క్రైస్తవులు కుటుంబ సభ్యులతో కలిసి క్రిస్మస్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం

ప్రజాశక్తి-శింగనమల

మండల పరిధిలోని నాయనవారిపల్లి గ్రామంలో వారం రోజులుగా నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ముగిసింది. బుక్కరాయసముద్రం మండలంలోని రోటరీపురం గ్రామం వద్ద ఉన్న ఎస్ఆర్ఐటి కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నాయనవారిపల్లి గ్రామంలో ఏడు రోజుల పాటు ఎన్ఎస్-ఎస్ ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా గ్రామస్తులకు కంటి పరీక్షలు, పాఠశాల విద్యార్థులకు యోగా, సాంకేతిక విజ్ఞానంపై అవగాహన, స్వచ్ఛభారత్‌లో భాగంగా పాఠశాలకు రంగులు వేసి అందంగా ముస్తాబు చేయడం, ప్లాస్టిక్ నిర్మూ లనలో భాగంగా గ్రామంలోని ప్రతి ఒక్క ఇంటికీ వెళ్లి జూట్ బ్యాగ్‌లు పంపిణీ చేయడం, తదితర అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం నిర్వహించిన ఎన్ఎస్ఎస్ శిబిరం ముగింపు సమావేశానికి ఎస్ఆర్ఐటి కళాశాల ప్రిన్సిపల్ డా. జి.బాలకృష్ణ, ఎంఇఒలు నరసింహరాజు, శివప్రసాద్, సర్పంచి రమణమ్మ, పాఠశాల హెచ్ఎం బాలనల్లప్ప ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు చదువుతో పాటు సమాజం పట్ల ఉన్న సేవాగుణం, బాధ్యతను కొనియాడారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్-4, 3 పిఒలు డా. సి.లక్ష్మీనారాయణ, వై.మధుసూధన్, జి.రామాంజినేయులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, పాల్గొ న్నారు.



ఎన్ఎస్ఎస్ శిబిరం ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

టిడిపి బలోపేతమే లక్ష్యం

పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా కవితాబొజ్జన్న

కవితా బొజ్జన్న దంపతులు

ప్రజాశక్తి-శెట్టూరు

తెలుగుదేశం పార్టీలో కష్టపడి పనిచేసే కార్యకర్తలు, నాయకులకు ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని మరోసారి నిరూపితమైంది. కళ్యాణదుర్గం మండలంలోని గోళ్ల గ్రామం సర్పంచి కవితా బొజ్జన్నను ఆ పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా పార్టీ అధిష్టానం నియమించింది. నిబద్ధత గల నాయకత్వానికి దక్కిన గౌరవంగా స్థానిక నాయకులు, కార్యకర్తలు ఈ నియామకాన్ని స్వాగతిస్తున్నారు. ఈ సందర్భంగా కవితాబొజ్జన్న మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ కీలక బాధ్యతను అప్పగించిన పార్టీ అధిష్టానం, ముఖ్యంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే దిశానిర్దేశంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఆమె తెలిపారు. పార్టీ నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, క్షేత్రస్థాయిలో తెలుగుదేశం పార్టీ అభివృద్ధి, కార్యకర్తల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తానన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నేతాజీ హైస్కూల్‌లో సైన్స్‌ఫేర్

ప్రజాశక్తి-నార్పల

స్థానిక శ్రీనేతాజీ హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహించిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శన(సైన్స్‌ఫేర్)నుఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఇందులో విద్యార్థులు ప్రదర్శించిన అత్యాధునిక, సృజనాత్మక శాస్త్ర ప్రాజెక్టులు అందరినీ ఆకట్టుకున్నాయి. పిల్లలు తమ శాస్త్ర ప్రాజెక్టులను స్వయంగా వివరించి, శాస్త్రంపై తమ అవగాహన, ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శించడంతో సందర్శకులు సంబరపడ్డారు. పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ తేజోవంతరెడ్డి విద్యార్థులను ఉత్సాహపరిచిన తల్లిదండ్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. డైరెక్టర్ తేజోవంతరెడ్డి సైన్స్ ఫేర్ విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. అలాగే అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రశంసించారు. తల్లిదండ్రుల సమక్షంలో విజేత విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి హాజరైన తల్లిదండ్రుల కోసం భోజన ఏర్పాట్లు కూడా చేశారు. సైన్స్ ఫేర్ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత, పరిశోధన ఆలోచనలను పెంపొందించడంలో ముఖ్యమైన పాత్ర పోషించిందని పలువురు ప్రశంసించారు.

పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు, రైతులు

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-పామిడి

మండల పరిధిలోని కత్రిమల, అప్పాజీపేట గ్రామాల్లో బుధవారం వ్యవసాయ అధికారులు 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రైతుల కోసం కంది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి విజయ్‌కుమార్ తెలియజేశారు. జనవరి రెండో వారం నుంచి ఎపి మార్క్‌ఫెడ్ ద్వారా మద్దతు ధర రూ. 8 వేలతో కంది కొనుగోలు చేస్తామన్నారు. కావున కంది పంట సాటు చేసిన రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. పంట కోత తర్వాత కందులను సజావుగా ఆరబెట్టుకొని 9 శాతం కంటే తక్కువగా తేమశాతం ఉండేటట్లు చూసుకోవాలన్నారు. ఇలా చేయడం వల్ల విత్తనానికి పురుగు పట్టకుండా ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో విఎఎలు, విహెచ్ఎలు పాల్గొన్నారు.

పొలాల్లో వాలిన విద్యుత్ స్తంభాలు..

రైతులకు పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండల కేంద్రమైన ఆత్మకూరు సమీపంలోని రైతుల పొలాల్లో విద్యుత్ స్తంభాలు వాలిపోయాయి. దీంతో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని ఆయా పొలాల రైతులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఇప్పటికే పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాలు.. ఆత్మకూరు నుంచి కళ్యాణదుర్గం వెళ్లే జాతీయ రహదారి పక్కన దాబా మల్లన్న పొలం సమీపంలో ఏర్పాటుచేసిన విద్యుత్ స్తంభాలు ఓ వైపు ప్రమాదకర స్థాయిలో వాలిపోయాయి. దీంతో రైతులకు ప్రమాదం పొంచి ఉందని పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని ఆ రైతుతో పాటు చుట్టుపక్కల పొలాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారి పక్కనే ఉండడంతో ఎప్పుడేం జరుగుతుందోనని భయపడుతూ అధికారుల నిర్లక్ష్య వైఖరిపై మండిపడుతున్నారు. ఇకనైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలను సరిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని రైతులు కోరుతున్నారు.



పొలంలో వాలిన విద్యుత్ స్తంభం

నేరాలు ఘోరాలు

రెండు బైక్‌లు ఢీ.. ఒకరు మృతి

ఘటనా స్థలంలో రోదిస్తున్న మహిళ

ప్రజాశక్తి-బెళుగుప్ప

రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం మండలంలోని వెంకటాద్రిపల్లి గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. బోరంపల్లి గ్రామానికి చెందిన బొజ్జప్ప(45) ఎర్రగుడి గ్రామంలో జరిగే ఊరు దేవరకు వెళ్లాడు. అక్కడ భోజనం చేసుకుని సాయంత్రం స్వగ్రామానికి తిరుగు పయనమయ్యాడు. అలాగే ముదిగల్లు గ్రామానికి చెందిన దేవా ద్విచక్ర వాహనంపై ఎర్రగుడి గ్రామం వెళ్తూ ఇద్దరూ వెంకటాద్రిపల్లి గ్రామ సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో బొజ్జప్ప అక్కడికక్కడే మృతి చెందగా దేవా తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు దేవాను కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-గుత్తి

మండల పరిధిలోని కరిడికొండ గ్రామ శివారులో 44వ జాతీయ రహదారిపై బుధవారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడిన సంఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. నంద్యాల జిల్లా డోన్ పట్టణానికి చెందిన మహబూబాషా పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై గుంతకల్లుకు బయల్దేరాడు. అతడు కరిడికొండ గ్రామ శివారులో వేగంగా వెళ్తుండగా ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు అతడిని 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బాలిక కోసం పోలీసుల గాలింపు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండల పరిధిలోని నేమకల్లు గ్రామానికి చెందిన కురుబ కల్లప్ప తన ఇద్దరు కూతుళ్లను సిరిగిరి గ్రామం వద్ద హెచ్ఎల్‌సి కెనాల్‌లో నెట్టేసిన విషయం తెలిసిందే. ఓ బాలిక మృతదేహం మంగళవారం కాలువపై 90వ కిలోమీటర్ల వద్ద లభించింది. ఎస్ఐ నబిరసూల్, వారి సిబ్బంది బుధవారం మరో బాలిక అనుష్క కోసం కాలువపై 90వ కిలోమీటర్ నుంచి 120వ కిలోమీటర్ వరకూ గాలింపు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం కురుబ కల్లప్ప కర్నాటకలోని బళ్లారి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని ఎస్ఐ తెలిపారు. ఓ సిఐ, ఎస్ఐ, నలుగురు కానిస్టేబుళ్లు, బాలిక బంధువులు, గ్రామస్తులు కాలువపై వెతుకుతున్నారు.

హెచ్ఎల్‌సి కాలువపై గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు



టైమ్ స్కేల్ ఇవ్వాలి

ఎస్కెయు ఇంజినీరింగ్, ఫార్మసీ ఉద్యోగుల అసోసియేషన్ ఏర్పాటు

ప్రజాశక్తి-అనంతపురం

శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలలో పని చేస్తున్న ల్యాబ్ అసి స్టెంట్లు, ప్రోగ్రామర్లు కలిసి ఎపి స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపల్లి విజయ భాస్కర్ ఆధ్వర్యంలో ఎస్కేయు ఇంజినీరింగ్, ఫార్మసిటికల్ సైన్స్ టెక్నాల్ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ ను ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పి.రవిమోహన్, ఉపాధ్యక్షులుగా ఎం.మారుతి కుమార్, కార్యదర్శిగా పి.క్రాంతికుమార్, సహాయ కార్యదర్శిగా బి.చంద్రశేఖర్, కోశాధికారిగా కె.భాస్కర్‌రావులను ఎన్నుకు న్నారు. నాయకులు మాట్లాడుతూ తాము 20 ఏళ్ల నుంచి పనిచేస్తున్నా నేటికీ టైం స్కేల్ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్, ఫార్మసీ ఉద్యోగులకు టైమ్ స్కేల్ సాధించడం కోసం ఎపి స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌కు అనుబంధంగా ఈ సంఘాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. ఉద్యోగుల హక్కుల కోసం రాజలేని పోరాటం చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు.

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌కు యాడికి విద్యార్థిని

ప్రజాశక్తి-యాడికి

మండల పరిధిలోని కోనఉప్పలపాడు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని సుహాసిని రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫేర్‌కు ఎంపికైంది. దీంతో ఆమె విజయవాడలో బుధవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ తన నమూనాలను ప్రదర్శించింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.చిన్నపెద్దన్న, గైడ్ టీచర్ వైఆర్.కృపావతి, ఉపాధ్యాయులు అరుణకుమారి, విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచంలో ప్రతి రోజూ రోడ్డు ప్రమాదంలో వేలాది మంది మృత్యువాత పడడం, ప్రమాదాలకు గురై వికలాంగులుగా మారుతున్నారన్నారు. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకొని సుహాసిని నూతన టెక్నాలజీతో ఇంటెలిజెన్స్ స్మార్ట్ సన్ గ్లాస్ రూపొందించారన్నారు. పగలైనా, రాత్రైనా వాహనాల్లో ప్రయాణం చేసే వారు ఇంటెలిజెన్స్ స్మార్ట్ సన్ గ్లాస్ పెట్టుకుని డ్రైవింగ్ చేసేటప్పుడు డ్రైవర్ పొరపాటున నిద్రపోయినా, కళ్లు మూత వేసినా వెంటనే సైరన్ మోగి అప్రమత్తం చేస్తుందన్నారు. మా పాఠశాల నుంచి తొలిసారి రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ లో పాల్గొన్న విద్యార్థిని సుహాసిని, గైడ్ టీచర్ ఉపాధ్యాయులను హెచ్ఎంతోపాటు గ్రామ పెద్దలు, ప్రజలు, విద్యా కమిటీ సభ్యులు అభినందించారు.

అంగన్వాడీ పోస్టులకు నోటిఫికేషన్

ప్రజాశక్తి-కణేకల్లు

కణేకల్లు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్త, సహాయకురాలి పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు సిడిపిఒ నాగమణి తెలిపారు. ప్రాజెక్టు పరిధిలోని హరే సముద్రంలో అంగన్వాడీ కార్యకర్త పోస్టు(ఈడబ్ల్యుఎస్), అంగన్వాడీ సహాయకురాలు కణేకల్-6(ఓసీ), గనిగేర-2(ఓసీ), తుమ్మిగనూరు-2(ఓసీ), సింగేపల్లి-1(ఓసీ), శ్రీధరఘట్ట-2(ఓసీ) భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. అభ్యర్థులు స్థానికులై ఉండి తప్పనిసరిగా పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అర్హత గల అభ్యర్థులు ఈ నెల 24 నుంచి 31వ తేదీ లోపు దరఖాస్తులు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కణేకల్లు కార్యాలయంలో సమర్పించాలన్నారు. మరిన్ని వివరాల కోసం కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

మహారాజశ్రీ తాడిపత్రి జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

E.P. No:11/2024 in O.S.No.:208/2022

Between:

కొలిమి మహబూబ్ భాషా ...డిహెచ్ఆర్

V/s

మగ్బుల్ died by Lrs and Others

1.క్రిష్ణాపాండు మహబూబ్ భాషా S/o Late మగ్బుల్ R/o Door No. 3/946 టైలర్స్ కాలని, తాడిపత్రి టౌన్, అనంతపురము జిల్లా ...జెడిఆర్(3)

పై కేసు నందు మూడవ ప్రతివాదిపై డిక్రీ అమలు కోరి వాది దావా మొత్తము రాబుట్టుకొనుటకు ఆస్తిని జప్తుచేసియున్నారు. మీకు పలుమార్లు పై కోర్టువారు ఎన్ని సార్లు నోటీసు పంపిన మీరు తీసుకొవడంలేదు. కావున వాదితరపున పత్రిక ముఖముగా కోర్టువారు ఆర్డర్ చేసియున్నారు. వాయిదా తేదీ:23-01-2026 ఉన్నది. కావున సదరు మీరు ఆ దినము 10:30 నిమిషములకు మీరు కాని మీ తరపున వకీలు గానీ అక్షేపణలు ఉంటే తెలుపుకోగలరు. లేని యెడల పరోక్షంగా తీర్మనించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:23-01-2026

దగ్గు శివయ్య, Bcom.,LLB
గూడూరు శ్రీధర్ కుమార్, M.A..,L.L.B..,
DHR వాదిపరం న్యాయవాదులు, తాడిపత్రి

సాగులో సాంకేతిక పరిజ్ఞానం అవసరం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వ్యవసాయ రంగంలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని రైతుల సమస్యలకు పరిష్కారం చూపే అగ్రిటెక్ స్టార్టప్‌లను ప్రోత్సహించాలని కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. బుధవారం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫిరెన్స్ హాల్‌లో వ్యవసాయ, ఉద్యాన, అనుబంధ రంగాల అధికారులు, రైతు ఉత్పత్తిదారుల సంఘం ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో అగ్రిటెక్ స్టార్టప్‌లను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చే వారికి ప్రభుత్వం నుంచి అవసరమైన రుణాల మంజూరు, సబ్సిడీ, ఉత్పత్తులను ప్రమోట్ చేయడం లాంటి సహకారం ఇస్తామన్నారు. బయో హెల్త్, క్రాప్ హెల్త్ మానిటరింగ్, ఫర్టిలైజర్ యూసేజ్, మైక్రో ఇన్నోవేషన్ మానిటరింగ్, తదితర స్టార్టప్‌లు, ఎఫ్‌పిఒలు ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాల్సుందన్నారు. హార్టికల్చర్ శాఖ ద్వారా అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు. వివిధ స్టార్టప్‌ల కోసం అవసరమైన డిపిఆర్‌లు తయారు చేయాలన్నారు. స్టార్టప్‌ల ఆలోచన బాగుంటే తగిన రుణాలు ఇప్పించాలని ఎల్డీఎంను ఆదేశించారు. ఈ సందర్భంగా పలువురు స్టార్టప్‌ల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వారి ఉత్పత్తులు, మార్కెటింగ్ అవకాశాలు, తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది రబీ సీజన్‌లో ఇప్పటివరకు 64,589 హెక్టార్లలో పంటలు సాగు చేయడం జరిగిందని, 60 శాతం పంటల సాగు జరిగిందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తెలిపారు. క్షేత్రస్థాయిలో రైతు సేవా కేంద్రాల్లో యూరియా, డిఎపి, ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ క్షేత్రస్థాయిలో చూపించిన విధంగా స్టాక్ నంబర్ తప్పు ఉండకుండా చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, పశుసంవర్ధక శాఖ జెడి ప్రేమ్ చంద్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఉమాదేవి, ఏపీఎంఐపి పీడీ రఘునాథరెడ్డి, మార్క్ఫెడ్ డిఎం పెన్నేశ్వరి, ప్రకృతి వ్యవసాయం డీపీఎం లక్ష్మానాయక్, ఆత్మా పీడీ పద్మలత, ఎల్డిఎం నరేష్ రెడ్డి, డీఆర్డీఏ పీడీ శైలజ, ఫిషరీష్ డిడి చంద్రశేఖర్ రెడ్డి, సిరికల్చర్ అధికారి మేతాజ్, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అగ్రిటెక్ స్టార్టప్‌లను ప్రోత్సహించాలి : కలెక్టర్ ఓ.ఆనంద్

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

అరటి తోటల పరిశీలన

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని సంజీవపురం గ్రామంలో రైతులు సాగు చేసిన అరటి తోటలను బుధవారం నార్పల ఉద్యాన అధికారి నెట్టి కంఠయ్య పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న అరటి గెలలను తెగుళ్ల, వ్యాధులు, పర్యావరణ నష్టం నుంచి రక్షణ కల్పించడానికి, పండ్ల నాణ్యత, దిగుబడి పెరగడానికి అరటి గెలల కవర్లు (స్లీవ్‌లు) చాలా అవసరం అన్నారు. పండించడాన్ని వేగవంతం చేసే మైక్రోక్లైమేట్‌ను కవర్లు సృష్టిస్తాయన్నారు. ఎండలో కాలడం లేదా రాలిపోవడం వల్ల వచ్చే మచ్చలను నివారిస్తాయన్నారు. గెలల బరువును 20-30 శాతం గణనీయంగా పెంచుతాయన్నారు. కావున ఉద్యాన శాఖ ద్వారా అరటి కాయలకు కవర్లు వేసేందుకు ఎకరాకు రూ. 10వేలు ఇస్తామని, గరిష్టంగా ఐదెకరాల వరకూ ఇస్తామన్నారు. ఆసక్తి ఉన్న రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రం లేదా ఉద్యాన అధికారి 80083 74669ని సంప్రదించాలన్నారు. ఆయన వెంట హెచ్ఇఒ రామాంజనేయులు, అరటి రైతులు ఉన్నారు.

అరటి తోటను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారులు

వినియోగదారులు మేల్కోవాలి

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

వస్తువులు కొనుగోలు చేసే విషయంలో చట్టం కల్పించిన హక్కులను వినియోగదారులు తెలుసుకోవాలని గుంతకల్లు లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ శంకర్ సూచించారు. పట్టణంలోని కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం వాణిజ్యశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల దినోత్సవం జరిగింది. ప్రస్తుత సమాజంలో వస్తువుల కొనుగోలు విషయంలో జరుగుతున్న మోసాలను విద్యార్థులకు వివరించారు. అలాగే ప్రయోగాత్మకంగా వివిధ రకాల తూనికలు కొలతలకు సంబంధించిన పరికరాలను ఉపయోగించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాసులు, అధ్యాపకులు లక్ష్మీనారాయణ, వినోద్‌కుమార్, పాండురంగ, హరికుమార్, ఫరీసా ఫిర్దోస్, నారాయణ, మల్లికార్జున, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ శంకర్

27న పంచాయతీ అద్దెభవనాలకు వేలం

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

పెద్దవడుగూరు పంచాయతీ పరిధిలో ఉన్న అద్దెభవనాలకు ఈనెల 27న వేలంపాట నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి పుష్పావతి తెలిపారు. పంచాయతీకి సంబంధించి 12 గదులు ఉన్నాయన్నారు. వీటిలో ఒక్కో గదికి నిర్ణయించిన అద్దె ధర ప్రకారం వేలంపాట జరుగునని తెలిపారు. వేలంలో పాల్గొనేవారు ముందుగా దరావతు రూ.6వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

వైభవంగా మారెమ్మ జాతర

బెళుగుప్ప : మండల పరిధిలోని ఎర్రగుడి గ్రామంలో బుధవారం మారెమ్మ ఊరిదేవర వైభవంగా ముగిసింది. గ్రామ దేవత మారెమ్మకు మంగళవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామున భక్తులు, ప్రజలు మారెమ్మ దేవతను దర్శించుకుని, మొక్కు తీర్చుకున్నారు. వచ్చిన బంధువులు, భక్తులతో గ్రామం కిటకిటలాడింది. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ శివ, ట్రైనింగ్ ఎస్ఐ మహేష్, ఎఎస్ఐ రాందాస్, పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

నార్పలలో ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు

నార్పల : మండల కేంద్రమైన నార్పలతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో బుధవారం ప్రీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్ డేవిడ్ ఆధ్వర్యంలో క్రైస్తవులు ర్యాలీగా ఇంటింటికీ వెళ్లి సువార్త బోధనలు చేశారు. గురువారం ఏసుక్రీస్తు జన్మదినం సందర్భంగా క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. క్రిస్మస్ వేడుకలకు నార్పలతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో చర్చిలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

'మాంటిస్సోరి'లో..

అనంతపురం : నగరంలోని సంగమేష్‌నగర్, గుత్తిరోడ్డులోని మాంటిస్సోరి పాఠశాలల్లో బుధవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ ఫ్రాలిక్స్ పేరుతో పాఠశాలలను రంగు రంగుల నక్షత్రాలు, క్రిస్మస్ చెట్లతో సుందరంగా అలంకరించారు. శాంటాక్లాస్ వేషధారణలు, క్రిస్మస్ విశిష్టత తెలిపే పాటలు, డాన్స్‌లతో అలరించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆ పాఠశాలల కరస్పాండెంట్ సి.సూర్య నారాయణరెడ్డి ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బందికి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి కె.మాధవి, ప్రిన్సిపల్స్ పద్మావతి, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

మాంటిస్సోరిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన చిన్నారులు

లచ్చానుపల్లిలో జాతర

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని లచ్చానుపల్లి గ్రామంలో బుధవారం పెద్దమ్మ, సుంకులమ్మ ఊరు జాతరను వైభవంగా నిర్వహించారు. ముందుగా గ్రామంలో వెలసిన పెద్దమ్మ, సుంకులమ్మ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు తలపై బోనాలు ఉంచుకుని మేళతాళాల మధ్య ఊరేగింపుగా వెళ్లి ఆలయం వద్ద అమ్మవారికి సమర్పించారు. జాతరలో ఎమ్మెల్యే సోదరులు గుమ్మనూరు శ్రీనివాసులు, నారాయణస్వామి, తనయుడు ఈశ్వర్, కార్మిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ జి.వెంకటశివుడుయాదవ్, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ జి.సూర్యప్రతాప్, శ్రీపురం సర్పంచి యు.రామలింగమయ్య పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర సందర్భంగా గ్రామంలో దుకాణాలు, జాయింట్ వీల్ ఏర్పాటు చేశారు. సిఐ ఎం.రామారావు, ఎస్ఐ కె.సురేష్ ట్రాఫిక్‌ను నియంత్రించారు.

చిన్నారుల బరువు నమోదు చేయాలి

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారుల్లో లోపాలను గుర్తించడం, నివారణ కోసం తప్పనిసరిగా ఖచ్చితమైన బరువులు నమోదు చేయాలని ఐసిడిఎస్ సిడిపిఒ లక్ష్మీప్రసన్న ఆదేశించారు. మెనూ ప్రకారం చిన్నారులకు మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. ఆమె బుధవారం బ్రహ్మసముద్రం సెక్టార్ పరిధిలోని ఎస్.కోనాపురం మెయిన్, మినీ, నంజాపురం అంగన్వాడీ సెంటర్లను సందర్శించి కార్యకర్తలకు పలు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి కార్యకర్త ఖచ్చితంగా ఆరేళ్ల లోపు పిల్లలందరి ఎత్తు, బరువులను పోషణ ట్రాకర్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. అలాగే గర్భిణులు, బాలింతలు వ్యక్తిగత వివరాలను ప్రధానమంత్రి మాతృ వందన యోజన యాప్‌లో తప్పక నమోదు చేయాలన్నారు. బరువు తక్కువ పిల్లలు, ఎస్ఎం, ఎస్‌యుడబ్ల్యు, స్టంటింగ్ పిల్లలు ఉంటే వారి తల్లిదండ్రులకు చిన్నారుల ఆరోగ్య స్థితి గురించి అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం నుంచి వచ్చే టేక్‌హోం రేషన్‌లో ఎలాంటి అంతరాయం లేకుండా అందించాన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు గృహ సందర్శనలు ఖచ్చితంగా చేయాలన్నారు. ప్రీస్కూల్ కార్యక్రమాలు ఖచ్చితంగా జరిగేలాగా చూసుకోవాలన్నారు. ఆమె వెంట సూపర్‌వైజర్ కాశీంబి, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జ్ఞానేశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు, చిన్నారులు, తల్లిదండ్రులు ఉన్నారు.

చిన్నారుల బరువును పర్యవేక్షిస్తున్న సిడిపిఒ లక్ష్మీ ప్రసన్న

ప్రజా సమస్యలపై కూటమి నాయకుల సమావేశం

ప్రజాశక్తి-యాడికి

ప్రజల సమస్యలపై బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో కూటమి పార్టీల మండల కన్వీనర్ల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షుడు దడియాల ఆదినారాయణ మాట్లాడుతూ పట్టణంలోని ప్రధాన సమస్యలైన డ్రైయినేజీ, వీధి దీపాలు ఏర్పాటు చేయడంతో పాటు పారిశుధ్య కార్మికులు ప్రతిరోజూ ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించేలా ప్రత్యేక ప్రణాళిక ఏర్పాటు చేస్తున్నామన్నారు. పట్టణ ప్రజలు కూడా సహకరించాలని కోరారు. కొన్ని వీధుల్లో తాగునీటి సమస్య అధికంగా ఉందని కార్యకర్తలు తెలపగా త్వరలోనే ఆ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. జనసేన, బిజెపి మండల అధ్యక్షులు సునీల్ కుమార్, రాజశేఖర్ మాట్లాడుతూ మండల స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలను ఇక్కడే పరిష్కరించుకోవాలని తెలిపారు.సమావేశంలో పట్టణ అధ్యక్షులు ఆదినారాయణ, ఉపాధ్యక్షుడు రామకృష్ణ, విశ్వనాథ్, మధురాజు, శేఖర్, రాజశేఖర్, సుబహాన్, లక్ష్మణ్, తాండ్ర విక్రమ్ పాల్గొన్నారు.

సౌత్ ఇండియా సైన్స్ ఎగ్జిబిషన్‌కు కోనాపురం ప్రాజెక్టు

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండలంలోని కోనాపురం జడ్పీ హైస్కూల్ విద్యార్థి సాత్విక్ సౌత్ ఇండియా సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎన్నికైనట్లు హెచ్ఎం చంద్రమౌళి పేర్కొన్నారు. దీంతో బుధవారం పాఠశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించి సాత్విక్‌ను సన్మానించారు. హెచ్ఎం మాట్లాడుతూ ఈ నెల 23, 24 తేదీల్లో విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో సాత్విక్ సౌత్ ఇండియా స్థాయికి ఎన్నికయ్యాడన్నారు. సాత్విక్ రూపొందించిన ప్రాజెక్టు గ్రాస్ కట్టర్(చీపెస్ట్) సౌత్ ఇండియా సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపికైనట్లు గైడ్ టీచర్ హరికృష్ణ తెలిపారు. రాష్ట్రం నుంచి సౌత్ ఇండియా సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపికైన రెండు ప్రాజెక్ట్‌లో మన పాఠశాల ప్రాజెక్ట్ ఎంపిక కావడం పాఠశాల, గ్రామానికి గర్వకారణం అన్నారు. ప్రాజెక్టు రూపకల్పనలో పాల్గొన్న విద్యార్థి సాత్విక్, గైడ్ టీచర్ హరికృష్ణను ఉపాధ్యాయులు, సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

ట్రోఫీతో సాత్విక్

వినియోగదారులు రశీదు పొందాలి

ప్రజాశక్తి-శెట్టూరు

వినియోగదారులు ఏ వస్తువు కొనుగోలు చేసినా తప్పనిసరిగా రశీదు పొందాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు రాజన్న సూచించారు. కళ్యాణదుర్గం మండల పరిధిలోని దొడఘట్ట గ్రామంలో బుధవారం జెవివి ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల హక్కులపై ప్రాథమిక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం వేణుగోపాల్ మాట్లాడుతూ వినియోగదారులు కొనుగోలు చేసిన వస్తువుల నాణ్యతను పరిశీలిస్తూ అప్పుడే తప్పకుండా రశీదు పొందాలన్నారు. వక్తలు మాట్లాడుతూ డీజిల్ మొదలు వివిధ కంపెనీల ప్యాకేజీ వస్తువులు, బంగారం తూనికలు కొలతలను పరిశీలిస్తూ, తప్పకుండా షాపులో రశీదు పొందాలన్నారు. అప్పుడే ఆ వస్తువు మన్నికపై మనకు పూర్తి హక్కు ఉంటుందన్నారు. తేడా వస్తే వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేసి నాణ్యమైన వస్తువు తిరిగి పొందే హక్కు వంద శాతం ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులతో నినాదాలు చేయించారు. కార్యక్రమంలో జెవివి జిల్లా ఉపాధ్యక్షులు రాజన్న, ఉపాధ్యాయ బృందం సీతాలక్ష్మి, జయలక్ష్మి, విజయ్‌కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుత్ను జెవివి నాయకులు

ముతవల్లి మృతిపై సంతాపం

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండల కేంద్రమైన బొమ్మనహాల్‌లోని నూరామి మజీద్ ముతవల్లి నూర్‌మహమ్మద్ బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సర్పంచితోపాటు టిడిపి నాయకులు, కార్యకర్తలు, వైసిపి నాయకులు పలువురు ఆయన కుటుంబాన్ని పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. సొసైటీ ప్రెసిడెంట్ మల్లికార్జున మాట్లాడుతూ మసీదుతో పాటు కబరస్తాన్‌కు ప్రభుత్వంతో స్థలం మంజూరు చేయించి వాటిని నిర్మించడంలో ఆయన కృషి మరువలేనిదన్నారు.